క్లుప్తంగా

హనుమత్, గజ వాహనాలపై ఊరేగిన శ్రీవారు



రావులపాలెంలో స్వామిని హనుమత్ వాహనంపై ఊరేగిస్తున్న గోవిందమాలధారులు

రావులపాలెం: స్థానిక అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 16వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం స్వామి వారికి సరస్వతీ హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతం స్వామి వారిని హనుమత్ వాహనంపై గోవిందమాల ధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి కమలనాథాచార్యుల ఆధ్వర్యంలో పలు పూజలు జరిపారు. సాయంత్రం చూర్ణోత్సవం నిర్వహించారు. రాత్రికి స్వామికి గజవాహనోత్సవ కన్నులపండువగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి, ఇతర సభ్యులు పర్యవేక్షించారు.

మోరిలో అమ్మవారి రథయాత్ర

సఖినేటిపల్లి: మోరిలో కొలువైన మహాలక్ష్మమ్మ, కనక మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర, తీర్థోత్సవాలో భాగంగా మంగళవారం మహాలక్ష్మమ్మ అమ్మవారి రథయాత్ర ఘనంగా నిర్వహించారు. ముప్పర్తి వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఈ రథోత్సవం కనులపండువగా మోరి, మోరిపోడు గ్రామాల్లో నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన సప్తాహం



పెదపట్నంలంకలో సన్మానం అందుకున్న భజన కళాకారులు

మామిడికుదురు: పెదపట్నంలంకలోని బొక్కా వారిపాలెం రామాలయం వద్ద ఏడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన సప్తాహం మంగళవారం ముగిసింది. కంచి నీలకంఠంగురుమూర్తి, నాగలక్ష్మి దంపతులతో పూర్ణాహుతి, కలశోద్వాశన పూజలు చేయించారు. బ్రహ్మశ్రీ గాడేపల్లి సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఏడు రోజుల పాటు ఆధ్యాత్మిక సేవలందించిన భజన కళాకారులను ఉత్సవ కమిటీ, పురజనులు ఘనంగా సత్కరించారు.

పిల్లల వైద్యానికి రూ.30 వేల సాయం



పిల్లల తల్లిదండ్రులకు సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: పూర్తిగా నెలలు నిండకుండా పుట్టిన పిల్లల వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.30 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన తుమ్మలపల్లి సీతారామయ్య-విజయలక్ష్మి దంపతులకు 10 రోజుల క్రితం నెలలు నిండకుండానే ఏడో నెలలో ఇద్దరు కవల పిల్లలు జన్మించారు. ఆ పిల్లల వైద్యానికి రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. అంత ఆర్థిక స్తోమత లేక పిల్లల తండ్రి దాతలను ఆర్థిక సాయం కోరారు. దీంతో కాశీ అన్నపూర్ణా దేవి సంస్థ సభ్యులు రావులపాలెంలో పిల్లల తల్లిదండ్రులకు నగదు చెక్కు అందజేశారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

అంబాజీపేట: ఇతరులకు ఆదర్శంగా ఉండేలా జనసైనికులు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో ఉన్న సామాజిక భవనంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ, యువజన అధ్యక్షులు అరిగెల సూరిబాబుల ఆధ్వర్యంలో పార్టీ మండల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 14న నిర్వహించే జనసేన పార్టీ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఈశ్వరరావు కుటుంబ సభ్యులకు పరామర్శ

అయినవిల్లి: అయినవిల్లి దూనబోయినవారిపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మట్టపర్తి ఈశ్వరరావు మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈశ్వరరావు భౌతికకాయానికి నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

ఓవర్ లోడ్...

- నిబంధనలకు పాతర
- ప్రమాదకరంగా వాహనాల రాకపోకలు
- బెంబేలెత్తుతున్న ప్రయాణికులు



విశ్వేశ్వరాయపురం ఆర్అండ్‌బీ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా కొబ్బరి లారీకి అధిక లోడు

మలికిపురం: రోడ్లపై వాహనాల రాకపోకలు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారం సాగుతున్నాయి. అటు ప్రజల రవాణా, ఇటు సరకు రవాణా వాహనాలు కూడా కనీస నిబంధనలు పట్టించుకోవడం లేదు. గమ్యం చేరాలన్న ఆలోచనే తప్ప ప్రాణాలకు రక్షణ ఎంత వరకూ ఉందనే ఆలోచన ప్రయాణికులకు ఉండడం లేదు. అలాగే ఎలాగైనా నాలుగు రాళ్ల వెనకేసుకోవాలన్న ఆశే తప్ప, ప్రయాణికులకు, తమకు శ్రేయస్కరమా?, ప్రభుత్వ నిబంధనలు ఎంత వరకూ పాటిస్తున్నామనే ఆలోచన వాహన యజమానులకూ ఉండడం లేదు. ఫలితంగా రోడ్లపై ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ, హైవే ఇతర మార్గాల్లో వెళ్లే లారీల వంటి భారీ వాహనాలతో పాటు, మినీ వ్యాన్‌లు, ట్రాక్టర్లు, ట్రక్కు ఆటోలు, తదితర గూడ్స్ రవాణా వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా సరకు లోడ్ చేసి రవాణా సాగిస్తున్నారు. ధాన్యం, బియ్యం, కొబ్బరి, సరుగుడు, గడ్డి తదితర సరుకు రవాణా అంతా నిబంధనలకు విరుద్ధంగానే ఓవర్ లోడ్‌తో రవాణా అవుతుంది. పైగా ఇరుకు రోడ్లలో సైతం ఈ వాహనాలు ప్రమాదకరంగా సాగుతున్నాయి. అలాగే ప్రయాణికులను ఇతర చోట్లకు తరలించడంలో అధికంగా వినియోగించ బడుతున్నాయి. నిబంధనలకు నీళ్లు వదిలి, ధనార్జనే లక్ష్యంగా నడుస్తున్న వాహనాల స్పీడుకు కూడా బ్రేకులు వేసే అధికారులు కూడా ఉండడం లేదు. దీంతో ప్రమాదాలకు ఆస్కారమేర్పడుతోంది. ప్రధానంగా వివాహ, ఇతర శుభ కార్యక్రమాలకు జనం తరలి వెళ్లేందుకు లారీలు, ట్రాక్టర్లు అధికంగా వినియోగిస్తున్నారు. వ్యవసాయ పనుల సీజన్‌లో కూలీలను తరలించేందుకు ట్రక్కు ఆటోలను కిరాయికి మాట్లాడుకుని సుదూర ప్రాంతాలకు సైతం ప్రతీ రోజూ రాకపోకలు సాగిస్తున్నారు. ఆయా సీజన్లలో ఏ గ్రామంలో చూసినా ఈ వాహనాల్లోనే రాకపోకలు జరుగుతున్నాయి. కిరాయి తక్కువగా ఉండడంతో పాటు, ఎక్కువ సంఖ్యలో ప్రయాణం చేసే అవకాశం ఉండడంతో ఈ ప్రమాదకర ప్రయాణాన్నే ఆశ్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇరుకురోడ్లపై ఈ వాహనాలు ప్రయాణించి కాలువలు, డ్రైన్లలో పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అనుభవం లేని వ్యక్తులు కూడా ఈ వాహనాలు నడుపుతూ డ్రైవర్లుగా చలామణి అవుతున్నారు. పగలంతా బిజీగా ఉండి రాత్రి ఖాళీ అయ్యే మరికొన్ని వాహనాలను యజమానులు డ్రైవర్లకు అద్దెకిచ్చి ప్రోత్సహిస్తున్నారు. పెద్దగా అనుభవం లేని ఆ కొత్త డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా సర్వీసులు చేసి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. రోజూ రాజోలు దీవిలో 25 శాతం మంది ప్రయాణికులు ఇలా ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారని అనధికార అంచనా. ఇటీవల పోలీసులు పహారా కాసి ఈ ప్రమాదకర ప్రయాణాలను కొంత వరకూ అరికట్టగలిగినా అనంతరం షరా మామూలే.

నిత్యం భయం భయం



ఓవర్ లోడ్‌తో వాహనాలు గ్రామీణ ప్రాంత ఇరుకురోడ్లను సైతం వదలడం లేదు. దీంతో ప్రజలు నిత్యం భయంతో రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఆ సమయంలో ట్రాఫిక్ జామ్ కూడా సమస్యగా మారుతుంది.

– కోళ్ల వేణుప్రసాద్, వినియోగదారుల సంఘ నాయకుడు, మలికిపురం

పరిమితికి మించితే చర్యలు



నిబంధనలకు విరుద్ధంగా సాగే వాహనాల ఓవర్ లోడ్, అక్రమ ప్రయాణికుల రవాణాపై దృష్టి పెడతాం. ప్రజలు, వాహనాల యజమానులు కూడా నిబంధనలు పాటించాలి. రవాణా శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని నిర్మూలిస్తాం. అవసరమైతే కేసులు నమోదు చేస్తాం.

– టి.నరేష్‌కుమార్, సీఐ, రాజోలు

దాతల సహకారం వెలకట్టలేనిది

మామిడికుదురు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం వెలకట్టలేనిదని కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) ఎస్కే సలీంబాషా సూచించారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌ను డీఈఓ ఆన్‌లైన్ ద్వారా సోమవారం ముమ్మిడివరం నుంచి ప్రారంభించారు. ఐబీఎంలో ఉన్నత ఉద్యోగం చేస్తున్న స్కూల్ పూర్వ విద్యార్థి ప్రతాప్‌నేని నవీన్ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించిన అనంతరం డీఈఓ బాషా మాట్లాడుతూ పాఠశాలకు సంబంధించిన సమస్త సమాచారం ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. ఇది విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూరుతున్నాయని చెప్పారు. వెబ్‌సైట్ ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థి నవీన్‌ను అతను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని, స్టాఫ్ సెక్రటరీ చొప్పళ్ల రమేష్‌బాబు, ఉపాధ్యాయులు భూపతి మనోహరరాజు పాల్గొన్నారు.



ముమ్మిడివరం నుంచి ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ

వైభవంగా సత్యదేవుని కల్యాణోత్సవం

మామిడికుదురు: మాకనపాలెంలో కొలువుదీరిన అనంతలక్ష్మీ, భూదేవీ సమేత సత్యనారాయణస్వామి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. మద్దాల మాధవరాయుడు, రత్నకుమారి దంపతులు కల్యాణ కర్తలుగా పాల్గొని స్వామి వారి వార్షిక కల్యాణాన్ని రమణీయంగా జరిపించారు. సుదర్శనం శేషాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాములు సత్యదేవుని కల్యాణాన్ని వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ఆద్యంతం కనుల పండువలా నిర్వహించారు. మద్దాల దొరబాబు ముత్యాల తలంబ్రాలను స్వామి, అమ్మవార్లకు కానుకగా సమర్పించారు. ఉభయ దేవేరులతో కొలువుదీరిన స్వామిని సోమవారం రాత్రి గరుడ వాహనంపై ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు గరుడ వాహన సేవలతో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం పలువురు భక్త దంపతులు స్వామి వారి వ్రతాలు ఆచరించారు. మొక్కులు, అభిషేకాలతో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పి.గన్నవరానికి చెందిన ఖాదర్ వలీఖాన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీపద్మావతీ కల్యాణం, కదంబరి కంజిరి కథ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



ఉభయ దేవేరులను పరిణయమాడిన సత్యదేవుడు

నూరు శాతం మార్కులు సాధించాలి

అంబాజీపేట: ఉపాధ్యాయుల ప్రోత్సాహం, విద్యార్థుల కృషి, సరస్వతీదేవి అనుగ్రహంతో పదో తరగతిలో నూరు శాతం మార్కులు సాధించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మాజీ సొసైటీ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్వర్యంలో సరస్వతీదేవి పూజను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఈ పూజలను వైభవంగా జరిపారు. స్థానిక పాఠశాలలో ఉన్న సరస్వతీదేవి విగ్రహం ముందు పరీక్ష అట్టలు, పెన్నులు, హాల్ టికెట్లను ఉంచి అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచారు. సరస్వతీదేవి విగ్రహదాత మాజీ సర్పంచ్ కొర్లపాటి సుబ్రహ్మణ్యవరప్రసాద్‌రావు కుమారుడు కోటబాబు పర్యవేక్షణలో అర్చకులు మర్ల శ్రీనివాస్ ఈ పూజలను నిర్వహించారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు కోటబాబు సమకూర్చిన పెన్నులను పూజలో ఉంచి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, సూదాబత్తుల రాము, ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సరస్వతీదేవి పూజలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంఈఓలు, విద్యార్థులు

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

ఆలమూరు: జొన్నాడలోని పదో తరగతి విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ జరిగింది. ఉపాధ్యాయుడు చింతా శ్రీనివాసరెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకుని రూ.పది వేలతో స్టేషనరీ కొనుగోలు చేసి ప్రధానోపాధ్యాయుడు పీవీ శ్రీనివాసరావుకు అందజేశారు. దీంతో ఆయన గ్రామ పెద్దలు ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి, కట్టా శ్రీనివాసు, నాండ్ర నాగమోహన్‌రెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి, తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి చేతుల మీదుగా ఈ స్టేషనరీని విద్యార్థులకు అందజేశారు. పీఎంసీ చైర్మన్ మెర్ల శ్రీనివాసు, సలాది శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ టాపర్లకు నగదు బహుమతులు

రాజోలు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ టాపర్లకు మంగళవారం నగదు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు ఆధ్వర్యంలో ముమ్మిడివరానికి చెందిన జి.శ్రీకాంత్ కన్సల్టెన్సీ ఎనిమిది మంది విద్యార్థులకు రూ.4 వేలు చొప్పున ఒక్కొక్కరికీ రూ.32 వేలు బహుమతిగా అందజేశారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని శ్రీకాంత్ అన్నారు. వచ్చే ఏడాది ఎక్కువ మంది విద్యార్థులకు నగదు బహుమతి అందించాలని కళాశాల అధ్యాపకులు కోరారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, పీఆర్వో నల్లి రాజు, శైలజ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి నగదు అందిస్తున్న దాత శ్రీకాంత్

'యువత పోరు'ను విజయవంతం చేయాలి

కొత్తపేట: నిరుద్యోగ యువత, విద్యార్థులకు కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ఎండగడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన 'యువత పోరు' కార్యక్రమం విజయవంతం చేయాలని నియోజకవర్గ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తపేటలో జిల్లా పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, సర్పంచ్‌లు నెల్లి లక్ష్మీపతిరావు, రెడ్డి చంటి, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు తదితరులు మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే యువత పోరు, పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాలపై చర్చించారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ పార్టీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో యువత పోరు పేరిట జిల్లా కేంద్ర అమలాపురంలో జరిగే నిరసనలో నిరుద్యోగులు, యువకులు, విద్యార్థులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకపోవడంపై విమర్శించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు రావులపాలెం పార్టీ కార్యాలయం వద్ద పార్టీ పతాకాన్ని జగ్గిరెడ్డి ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని పేషెంట్లకు, గర్భిణులకు, వృద్ధులకు పండ్లు, వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేస్తారని తెలిపారు. అక్కడి నుంచి యువత పోరుకు భారీ ర్యాలీగా అమలాపురం కలెక్టరేట్‌కు వెళ్లి యువతకు జరుగుతున్న అన్యాయంపై వినతిపత్రం సమర్పిస్తారని తెలిపారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించాలని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ తెలిపారు. గ్రామాల్లో ఉన్న దివంగత నేత వైఎస్సార్ విగ్రహాలకు నూతన రంగులు వేయించి నివాళులర్పించాలన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించాలన్నారు. పండగ వాతావరణంలా ఆవిర్భావాన్ని జరుపుకోవాలని శేఖర్ కోరారు. అలాగే బుధవారం పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అమలాపురం కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే యువత పోరు కార్యక్రమాన్ని మండలంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



కొత్తపేటలో మాట్లాడుతున్న డేవిడ్‌రాజు, గంగాధరరావు తదితరులు

అయినవిల్లిలో..

అయినవిల్లి: అమలాపురంలో జరగనున్న యువత పోరును విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ అయినవిల్లి మండలశాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. మంగళవారం సిరిపల్లిలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే యువతను అని రకాలుగా అభివృద్ధి వైపు తీసుకెళ్తామని చెప్పారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక యువతను పట్టించుకోలేదన్నారు. యువత పోరుతో కూటమి నాయకులు కళ్లను తెరిపించేందుకు వైఎస్సార్ సీపీ అధినేత మాజీ సీఎం జగన్ పిలుపు మేరకు యువత పోరుబాట చేపట్టామన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

ఆలమూరు: గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని రామచంద్రపురం ఇన్‌చార్జ్ డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్పీవో) ఎ.రాజు సూచించారు. మండలంలోని చొప్పెల్ల, మడికి, చెముడులంక, నవాబుపేట, గుమ్మిలేరు నవాబుపేట తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి తడి పొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించారు. అలాగే ఆయా గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పనితీరును అడిగి తెలుసుకున్నారు. డీఎల్పీఓ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో రామచంద్రపురం, మండపేట, కొత్తపేట నియోజకవర్గాలకు సంబంధించిన తొమ్మిది మండలాలలో 65 గ్రామ పంచాయతీలను ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్)కు ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఈనెల మూడో వారం నుంచి ఈ సిస్టమ్ ద్వారా ప్రభుత్వం నేరుగా ఆయా ఇంటి యజమాలకు ఫోన్ చేసి ప్రజాభిప్రాయ సేకరణ తీసుకుంటారన్నారు. గ్రామ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



చొప్పెల్లలో తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కొత్తపేట: కూచిపూడి, సంప్రదాయ నృత్యంలో కళాశాల విద్యార్థిని రావి బేబీసత్యవాణి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు ఆకాంక్షించారు. డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ రెండో సంవత్సరం చదువుతున్న రావి బేబీత్యవాణి ఈ నెల 6న అహోబిలం లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 7న బిర్లా ప్లానిటోరియంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చి సన్మానాలు అందుకుంది. 8న హైదరాబాద్ పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో నృత్యప్రదర్శన ఇచ్చి గురుబ్రహ్మ విశిష్ట పురస్కారం, 9న రవీంద్రభారతిలో ప్రదర్శించి విశ్వకళానిధి అవార్డుతో సన్మానాలు అందుకుంది. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం కళాకారిణి సత్యవాణి అభినందన కార్యక్రమం ప్రిన్సిపాల్ కేపీ రాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, అధ్యాపకులు డీసీహెచ్ పాపారావు, సత్యనారాయణ, అంకమరావు, నాగరాణి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సత్యవాణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు

ఘనంగా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల మాజీ ప్రొఫెసర్ కేవీ సుబ్బరాజు, చార్టర్డ్ అకౌంటెంట్ కొండయ్యలు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సూర్యనారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండముచ్చును బంధించిన అధికారులు



కొండముచ్చును బంధించిన అధికారులతో సర్పంచ్ ఆనందకుమార్ తదితరులు

మలికిపురం: మండలంలోని శంకరగుప్తంలో గత కొంత కాలంగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న కొండముచ్చును మంగళవారం అటవీ అధికారులు బంధించి అటవీ ప్రాంతానికి తరలించారు. గ్రామంలో ఈ కొండముచ్చుకు ఆకతాయిలు మద్యం అలవాటు చేయడంతో దానికి బానిస అయిన ఈ కొండముచ్చు స్థానిక ప్రజలపై దాడికి పాల్పడుతుంది. దీంతో స్థానికులు అటవీ అధికారులను సంప్రదించడంతో మంగళవారం ఈ మేరకు తరలింపు చర్యలు చేపట్టారు. సర్పంచ్ రాపాక ఆనందకుమార్, తాడి సహదేవ్ తదితరులు కొండముచ్చు తరలింపునకు సహకరించారు.

వెన్నెముక బాధితుడికి సాయం



అంతర్వేది ప్రకాశపురంలో బాధితుడు సురేంద్రకు సాయం చేస్తున్న రాపాక, రాజు

సఖినేటిపల్లి: అంతర్వేది ప్రకాశపురానికి చెందిన చొప్పల సురేంద్రకు మంగళవారం నిరుపేద సహాయ నిధి గ్రూపు సభ్యులు సమకూర్చిన రూ.11,000 నగదును రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, కేఎస్ఎన్ రాజు చేతుల మీదుగా అందజేశారు. సురేంద్ర కరెంట్ పనికి వెళ్లి ప్రమాదవశాత్తూ స్తంభంపై నుంచి పడి, వెన్నెముక సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. నిరుపేద సహాయ నిధి సభ్యులు పాల్గొన్నారు.

ఎల్.గన్నవరం ఇన్‌చార్జి సర్పంచ్‌గా గంగాభవాని

పి.గన్నవరం: మండలంలోని లంకల గన్నవరం గ్రామ సర్పంచ్ పసలపూడి రామకృష్ణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో ఉప సర్పంచ్‌గా పనిచేస్తున్న గనిశెట్టి గంగాభవానిని ఇన్‌చార్జి సర్పంచ్‌గా నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతాలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ కె.విజయ ప్రసాద్ మంగళవారం విలేకరులకు తెలిపారు.

దాతల సహకారంతో మౌలిక వసతులు



పాఠశాలకు యూనిఫాం అందిస్తున్న దాతలు

మలికిపురం: బట్టేలంకలో అల్లూరి తిమ్మరాజు మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం దాతల సాయంతో మౌలిక వసతులు కల్పించారు. గ్రామానికి చెందిన కూనపరాజు వెంకటరామచంద్రరాజు (బట్టేలంక) ప్రోత్సాహంతో దివంగత దంతులూరి రామకృష్ణంరాజు జ్ఞాపకార్థం ఆయన భార్య శారద, వారి కుమారులు వెంకటరమణ కుమార్ (వైజాగ్) ఆర్థిక సహకారంతో రూ.27 వేలతో పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం ఎక్సర్‌సైజ్ పార్లర్ బార్ సమకూర్చారు. స్కౌట్స్ (బాలురకు) యూనిఫామ్ బహూకరించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం హనుమంతరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బోనం సీతారత్నం, ఎస్ఎంసీ చైర్మన్ లక్కుం దుర్గాప్రసాద్, ఎంపీటీసీ ఆవుపాటి ఉమాలలిత శివజ్యోతి, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ముదునూరి సీతారామరాజు, స్కౌట్ మాస్టర్ కడలి నాగరాజు, గైడ్ కెప్టెన్ కె.శ్రీదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరల్డ్ కన్జ్యూమర్స్ డే వారోత్సవాలు ప్రారంభం

పి.గన్నవరం: వినియోగదారులు సంఘటితమై పోరాడి తమ హక్కులను కాపాడుకోవాలని కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామ్మూర్తి అన్నారు. స్థానిక గ్రేస్ డిగ్రీ కళాశాలలో వరల్డ్ కన్జ్యూమర్ డే వారోత్సవాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కోనసీమ కన్జ్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ వినియోగదారులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తుందని అన్నారు. వైద్య రంగంలో మెడికల్ మాఫియా సమాజాన్ని పీడిస్తుందని పి.గన్నవరం వినియోగదారుల సంఘం అధ్యక్షుడు నల్లా పెదకాపు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేస్ కళాశాల కార్యదర్శి నల్లి శ్రీచరణ్, కోకోఫెడ్ కార్యదర్శి ఆదిత్య కిరణ్, డి.వెంకట్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌డేలో విద్యార్థుల ప్రతిభ

సఖినేటిపల్లి: ముమ్మిడివరంలో నిర్వహించిన నేషనల్ సైన్స్‌డేలో ప్రతిభ చూపిన మండలంలోని ఉయ్యూరువారి మెరక ప్రైమరీ స్కూల్ విద్యార్థులను ప్రముఖులు అభినందించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన చెల్లుబోయిన రామ్ రోహిత్‌ను, పార్టిస్పేట్ బహుమతి పొందిన జెల్లా అజయ్‌లను సర్పంచ్ ఒగూరి రత్నకుమారి అభినందించారు. ఎంఈఓ-1 డి.కిషోర్ కుమార్, ఎంఈఓ-2 మద్దాలి వెంకటేశ్వరరావు, హెచ్ఎం జెల్లా శ్రీనివాసరావు, పాఠశాల దాత కంతేటి వెంకట్రామరాజు, ఎస్ఎంసీ చైర్మన్ భారతి పాల్గొన్నారు.